సాక్షి
గుంటూరు
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024





పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో బస్సుకు ఎదురేగి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న జనసందోహం

సాయంత్రం 4:39 గంటలకు ..
గుంటూరు జిల్లా పొన్నూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



ప్రణమిల్లిన పొన్నూరు

మేనిఫెస్టో ప్రకటించాక తొలిసారి పొన్నూరు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

- 42 డిగ్రీల ఉష్ణోగ్రతలో సైతం తరలివచ్చిన జనసందోహం
- అంచనాకు మించి ప్రజలు రావడంతో కిటకిటలాడిన పొన్నూరు పట్టణం
- మోసపూరిత పాలనకు, సుపరిపాలనకు తేడా చూడాలన్న జగన్
- 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలను గెలిపించేందుకు సిద్ధమేనా అన్న పిలుపునకు 'సిద్ధం సిద్ధం' అంటూ ప్రతిస్పందించిన జనసందోహం
- మురళన్న మంచివాడు...రోశయ్య అన్న సౌమ్యుడు అంటూ అభ్యర్థులను సభకు పరిచయం చేసిన ముఖ్యమంత్రి
- రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఇద్దరినీ గెలిపించాలని పిలుపు

ఎన్నికల మేనిఫెస్టో ప్రకటన అనంతరం తొలిసారి జిల్లాకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు పొన్నూరు ప్రజలు పట్టాభిషేకం చేశారు....
పేదల కన్నీళ్లు తుడిచేలా.. పండుటాకులకు నిండు భరోసా నిచ్చేలా..
అక్క చెల్లెమ్మలకు మరింత ఆర్థిక ఆసరా కల్పించేలా..
చిన్నారులు, యువత భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా..
పేదలకు మరింత మేలు చేసేలా.. సంక్షేమ జెండా సగర్వంగా ఎగిరేలా..
ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా..జనత కలలు సాకారం చేసేలా రూపొందించిన మేనిఫెస్టోకు పెద్దఎత్తున తరలివచ్చిన జనసందోహం తమ హర్షధ్వానాలతో ఆమోదం తెలిపింది.
ఐదేళ్లలో జన బతుకులు మార్చి..సంక్షేమాభివృద్ధితో అండగా నిలిచిన జగనన్న వెంటే ఉంటామని ప్రతిన బూనారు..
బూటకపు వాగ్దానాలకు మోసపోమని.. ఇప్పటికీ.. ఎప్పటికీ మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్రణమిల్లారు.





గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణలను సభకు పరిచయం చేస్తున్న సీఎం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పొన్నూరు జనసంద్రమైంది. 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయినా తమ నేతపైన ఉన్న అభిమానంతో ఎండను లెక్క చేయలేదు. అభిమానం ముందు సూరీడు చిన్నబోయాడు. మధ్యాహ్నం మూడు గంటలకు సభ అని ప్రకటించినా ఉదయం నుంచే నియోజకవర్గం నలుమూలల నుంచి అభిమానులు తరలివచ్చారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్నంత సేపు అభిమానుల కేరింతలతో పొన్నూరు మార్మోగింది. సెంటర్ నిండిపోవడంతో అభిమానులు భవనాలపైకి ఎక్కి సీఎం ప్రసంగాన్ని విన్నారు. తీన్మార్ డప్పులతో వివిధ వార్డుల నుంచి పార్టీ కార్యకర్తలు ఊరేగింపుగా తరలి వచ్చారు. కల్లుగీత కార్మికులు తాటిచెట్టును ట్రాక్టర్‌కు కట్టి ఊరేగింపుగా వచ్చారు. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. హెలిప్యాడ్ నుంచి పొన్నూరు అంబేద్కర్ సెంటర్ వరకూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్‌షో నిర్వహించారు. జై జగన్ నినాదాలతో శ్రేణులు హెలిప్యాడ్ నుంచి సభ జరిగే ప్రాంతం వరకూ కాన్వాయ్ వెంట జనం పరుగులు తీశారు.



వైఎస్సార్ సీపీ గుర్తు ఫ్యాన్‌ను చూపుతున్న సీఎం

58 నెలల సుపరిపాలన..

పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో అశేష అభిమానసంద్రాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. 14 సంవత్సరాల మోసపూరిత పాలనకు, 58 నెలల సుపరిపాలనకు తేడా చూడాలని జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. చంద్రబాబు నన్ను బచ్చా అంటున్నాడు, నేను బచ్చానే అయితే 14 సంవత్సరాల తన పాలనలో చేసిన మంచిని చూపించి ఓటు అడగడం మానేసి నన్ను తిట్టడమే పనిగా ఎందుకు పెట్టుకున్నాడని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 58 నెలల జగన్ పాలనకు భయపడి రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నాడని జగన్ చెప్పినప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ గెలవాల్సిందే. తగ్గదే లేదు సిద్ధమేనా అని జగన్ ప్రశించినప్పుడు జనం సిద్ధమే అని నినాదాలు చేశారు. 'ఫ్యాన్ ఇంట్లో ఉండాలి? చెడు చేసిన సైకిల్ వీధిలో ఉండాలి. తాగేసిన గ్లాస్ సింక్‌లో ఉండాలి' అన్నప్పుడు జనం అవును.. అవును అంటూ పెద్ద ఎత్తున స్పందించారు.

మురళీ అన్న మంచివాడు..

పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురళన్న(అంబటి మురళీకృష్ణ) మంచివాడు, సౌమ్యుడు. మీకు మంచి చేస్తారన్న నమ్మకం, విశ్వాసం ఉంది. పార్లమెంట్ అభ్యర్థిగా రోశయ్య అన్న పోటీ చేస్తున్నాడు. మంచి వాడు సౌమ్యుడు, మాటలు కొంచం కటువుగా అనిపించినా మనస్సు వెన్న. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు రోశయ్య, మురళీలపై ఉంచాలని కోరారు.

పొన్నూరు.. సిద్ధమా..

పొన్నూరు సిద్ధమా అంటూ ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభించడంతో అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతం మార్మోగింది. పోయే కాలం వచ్చినప్పుడు విలన్‌లందరికి హీరో బచ్చాగాడిలా కనిపిస్తాడు... అయ్యా చంద్రబాబు.. నువ్వు బచ్చా అంటున్నా నేను ఇంటింటికి మంచి చేసి ఎన్నికల్లో ఒంటరిగా ధైర్యంగా నిలబడి ఓటు అడుగుతున్నా నువ్వు బచ్చా అన్న ఈ జగన్ ఇంటింటికి మంచి చేసి ఒంటరిగా నిలబడి ధైర్యంగా అడుగుతా ఉన్నాడు. మరి 14 ఏళ్లు సీఎం అంటావు, మూడు సార్లు సీఎంగా చేశానంటావు, మరీ నీ పేరు చెబితే ఏ పేదవాడికైనా కూడా ఒక్కంటంటే మంచి గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించినప్పుడు జనం నుంచి మంచి స్పందన లభించింది.



వైఎస్సార్ సీపీ జెండాతో చిన్నారి

హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి ఘనస్వాగతం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, గుంటూరు తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమాలతోపాటు గుంటూరు డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు సీఎంకు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

చంద్రబాబు మోసాల నిగ్గదీతపై విశేష స్పందన..

2014లో ఇంటింటికి చంద్రబాబు నాయుడు సంతకం చేసి పంపిన పాంప్లేట్‌లో ముఖ్యమైన హామీ రైతు రుణమాఫీ అంటూ మొదటి సంతకం చేస్తానన్నాడు. రూ. 87,612 కోట్లు రుణ మాఫీ జరిగిందా అని అడుగుతా ఉన్నా అన్నప్పుడు జనం లేదు.. లేదు.. అని పెద్దపెట్టున నినదించారు. ఇదే చంద్రబాబు నాయుడు సంతకం పెట్టి ఆయన చేసిన రెండో హామీ పొదుపు సంఘాల రుణాలన్ని రద్దు చేస్తానన్నాడు. మరి రూ. 14,205 కోట్లు పొదుపు సంఘాలకు సంబంధించిన రుణాలు, ఇందులో ఒక్క రూపాయి అయినా మాఫీ చేశాడా అని అన్నప్పుడు లేదు.. లేదు అంటూ జనం నినదించారు. మూడో హామీ అంటూ ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ. 25వేలు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు. కనీసం ఒక్క రూపాయి అయినా చేశాడా అని అన్నప్పుడు అస్సలు లేదు.. లేదు అంటూ చేతులు ఊపుతూ మరీ జనం ప్రతిస్పందించారు. ఇంటింటికి ఉద్యోగం.. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలనెలా రూ.2వేలు నిరుద్యోగ భృతి అని ఈ పెద్ద మనిషి చెప్పాడు. ఐదు సంవత్సరాలు అంటే 60 నెలలకు.. నెలకు రూ. 2వేలు అంటే ప్రతి ఇంటికి రూ. 1.20 లక్షలు ఇచ్చాడా అని అడుగుతా ఉన్నాను.. అంటూ చంద్రబాబు మోసాల గురించి ప్రశ్నించినప్పుడల్లా జనం తమ రెండుచేతులను అడ్డంగా ఊపుతూ చంద్రబాబు మోసం చేశాడంటూ కేకలు పెట్టారు. ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తానన్నాడు, మీ పొన్నూరులో కనిపించిందా.. అన్ని ప్రశ్నించగా జనం లేదంటూ చేతులూపారు.

నిరంతరం మోసం చేసే వ్యక్తి చంద్రబాబు

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పెత్తందార్లకు, పేదలకు జరిగే యుద్ధంలో ప్రజలంతా పేదల పక్షమైన వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని అన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏ రోజైనా సామాన్య ప్రజలకు మంచి చేశాడా అని మండిపడ్డారు. పెత్తందార్లకు మేలు చేయడమే తప్ప పేద ప్రజలకు మంచి చేసిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. ప్రజలను నిరంతరం మోసం చేసే వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గల్లా జయదేవ్ 10 ఏళ్లు ఎంపీగా ఉన్నా ప్రజలెవరికీ కనిపించని నేతగా చరిత్రకెక్కాడని అన్నారు. ఇప్పుడు మళ్లీ డబ్బుల మూటతో వచ్చిన అమెరికా నేత పెమ్మసానిని తెచ్చి ప్రజల్ని మోసగించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడని దుయ్యబట్టారు. డబ్బుందన్న అహంకారంతో ఉన్న పెమ్మసానికి గుంటూరు మిర్చిదెబ్బ చూపిస్తానని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది సీఎం వైఎస్ జగన్ వేస్తున్నారని అన్నారు. పేదరికం నిర్మూలన జరిగేంత వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందని అన్నారు.

– కిలారి వెంకట రోశయ్య

పొన్నూరులో గెలుపు తథ్యం

వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో అవినీతి లేని పాలన అందిస్తానని తెలిపారు. కాపు సామాజిక వర్గం అత్యధికంగా ఉన్న పొన్నూరులో తన గెలుపు తథ్యమని అన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే ధూళిపాళ్ల నరేంద్ర జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నరేంద్ర అవగాహన లేని రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి రోశయ్యను, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

– అంబటి మురళీకృష్ణ



సీఎం వైఎస్ జగన్‌ను ఫొటో తీసుకుంటున్న యువకులు



సభ వద్ద జయహో జగన్ అంటూ మహిళల నినాదాలు



అంబటి ప్లకార్డులను చూపుతున్న చిన్నారులు



175 కి 175 సిద్ధమంటూ చేతులెత్తి జైకొడుతున్న జనసందోహం



అంబటి ప్లకార్డుతో ఓ వృద్ధురాలు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మందపాటి



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావును గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమిస్తూ.. ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎన్‌యూలో 'డ్యాన్స్' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ రాజశేఖర్, డాక్టర్ శృతకీర్తి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో భాగమైన నృత్య విభాగ అధ్యాపకురాలు డాక్టర్ శృతకీర్తి రచించిన 'కారణాస్ – ది యూనిట్స్ ఆఫ్ డ్యాన్స్' అనే పుస్తకాన్ని సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం ఎంతో మంచి పరిణామమన్నారు. డ్యాన్స్‌కు సంబంధించిన మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజని నియోజకవర్గంలోని 30వ డివిజన్ ఏటీ అగ్రహారంలో సోమవారం మనతో మన రజనమ్మ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – పట్నంబజారు



వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ సోమవారం రూరల్ మండలంలోని 46వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను పలకరించి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. – గుంటూరు రూరల్



వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా నియోజకవర్గంలోని 14వ డివిజన్ కబాడీ గూడెంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పలువురు వ్యాపారులను కలిసి, ఓట్లు అభ్యర్థించారు. – పట్నంబజారు

ప్రచార పర్వం

పెమ్మసాని.. నోరు అదుపులో పెట్టుకో



పార్టీలో చేరిన వారితో ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా

- అదుర్స్ సినిమాలో బ్రహ్మానందంలా కలలు
- గుంటూరులో వార్ వన్‌సైడ్. వైఎస్సార్ సీపీ విజయమే
- ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక

పట్నంబజారు: పట్నంబజార్: టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి హితవు పలికారు. నీకు ఇది వార్నింగ్.. డబ్బులు ఉన్నాయని బెదిరింపు రాజకీయాలు చేస్తే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజనల్ కార్యాలయంలో సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు అట్లాస్ రహంతుల్లా, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మందితో కలసి పార్టీలో చేరారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా, పశ్చిమ నియోజవకర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్, పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమాతో కలసి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి స్వాగతం పలికారు.

రిటర్న్ టికెట్ బుక్‌చేసుకోవడం ఖాయం

ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ వచ్చే నెలలో యూఎస్‌కు రిటర్న్ టికెట్ బుక్ చేసుకోవడం ఖాయమని, టీడీపీ పరిస్థితి జీరోగా మారిపోయిందని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజనల్ కార్యాలయంలో సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అమెరికా నుంచి డబ్బుతో దిగిన గుంటూరు పెమ్మసాని మాటలు వింటుంటే చాలా హాస్యాస్పదంగా ఉన్నాయని చెప్పారు. అదుర్స్ సినిమా బ్రహ్మానందం మాదిరిగా ఆయన ఊహల్లో బతికేస్తున్నారని ఎద్దేవా చేశారు. పెమ్మసాని ఒక పక్క నీతి మాటలు మాట్లాడుతూ మరొక పక్క బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా ప్రజలు చాలా చైతన్యం కలిగిన వారిని పెమ్మసాని డబ్బు ప్రలోభాలకు ఎట్టి పరిస్థితుల్లో గురికారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసే స్థాయి పెమ్మసానిది కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బెదిరింపు రాజకీయాలకు గుంటూరు ప్రజలు ఏ మాత్రం భరించరని చెప్పారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి, తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రెండు రోజుల క్రితం విడుదల చేసిన మేనిఫెస్టోలో స్పష్టంగా తెలియజేశారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మన ఇంటి బిడ్డ నూరిఫాతిమాను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా మాట్లాడుతూ ఆయా పార్టీల నుండి సీఎం వైఎస్ జగన్ సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీలోకి చేరటం సంతోషదాయమన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గులాంరసూల్, జియాఉర్‌రెహ్మాన్, డాక్టర్ వై.షేక్, మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలిచేది మేమే.. అభివృద్ధి చేసేదీ మేమే

- గుంటూరు పశ్చిమలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలోకి చేరికల వెల్లువ



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గెలిచేది తామేనని, గుంటూరు నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేది కూడా తామేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి, ఆయా పార్టీలకు చెందిన వందలాదిమంది పలు సమూహాలుగా వైఎస్సార్ సీపీలో చేరారు. చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం, శ్యామలానగర్‌లోని మంత్రి నివాసంలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రజల మనసు గెలుచుకున్న నేత ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు.

టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 200 మంది

వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో 24, 25 డివిజన్ల నుంచి టీడీపీ, జనసేనకు చెందిన 200 మంది పార్టీలో చేరారు. 24వ డివిజన్ కొత్తకాలనీ నుంచి టీడీపీ మైనారిటీ సెల్ మహిళా అధ్యక్షురాలు సల్మా నేతృత్వంలో వంద మంది, 25వ డివిజన్ ఆకులవారితోట నుంచి కాంగ్రెస్‌పార్టీ మాజీ కార్పొరేటర్ ఖాసింబి నేతృత్వంలో వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. చేరినవారిలో మస్తఫా, సిద్ధిక్, మగ్బుల్, షేక్ బాజి, మహబూబ్ బాషా, ఆసిఫ్, ఫయాజ్, షేక్ గౌస్ ఉన్నారు. వైఎస్సార్ సీపీ 34వ డివిజన్ నుంచి కాటుమాల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు, కోబాల్ట్‌పేట, నగరంపాలెం ప్రాంతాల నుంచి 75 మంది జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. మాదాసు మరియమ్మ, ముక్తం రమేష్, వెల్లంపల్లి జయ, పి.బుజ్జి, డి.సాంబ, మణికంఠ, పెండెం సౌజన్య, బురదగుంట సునీత, ఎం.ఆశీర్వాదం, బోడపాటి చంద్ర తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో..

28వ డివిజన్ సీతమ్మకాలనీ, బుడుగుజంగాల కాలనీ నుంచి 20 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక కార్పొరేటర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. భరతకవి కోటయ్య, నెర్లకంటి సీతారామయ్య, భరతకవి చిన్న శ్రీనివాసరావు, భరతకవి తిరుపతయ్య, భరతకవి శివయ్య, భరతకవి రమేష్, భరతకవి తిరుపతయ్య, భరతకవి రామారావు, భరతకవి అంజి, రామారావు, నాగరాజు, వెంకటసాయి తదితరులు పార్టీ కండువాలు కప్పుకున్నవారిలో ఉన్నారు.

22వ డివిజన్ నుంచి..

పార్టీ 22వ డివిజన్ అధ్యక్షుడు జానీబాషా ఆధ్వర్యంలో అదే డివిజన్ నుంచి 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. సైదా మొహిద్దీన్, సత్తార్, అత్తావుల్లా, షేక్ నాగూర్ మీరావలి, అబ్దుల్ ఖలీల్, షేక్ షరీఫ్, అబ్దుల్ ఉమర్, సిద్దా ఎస్‌కే, కమల్ బాషా, సైజ్జాం మీరావలి, రహతుల్లా, పీరు సాహెబ్, బాజి, మస్తాన్, జానీ, రియాజ్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైళ్లను పునరుద్దరణ, దారిమళ్లించడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ సోమవారం వెల్లడించారు. రైలు నంబర్ 07580 మాచర్ల-నడికుడి, 07579 నడికుడి-మాచర్ల, 17646 రేపల్లె-సికింద్రాబాద్, 17645 సికింద్రాబాద్-రేపల్లె రైలు ఈనెల 30వ తేదీ నుంచి పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. నంబర్ 12806 లింగంపల్లి-విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈనెల 30వ తేదీన పగిడిపల్లి, ఖాజీపేట, కొండపల్లి, విజయవాడ వైపుగా యథావిధిగా ప్రయాణిస్తాయని తెలిపారు.

పశ్చిమలో రజినమ్మను గెలిపించుకుంటాం

- బీసీలంతా వైఎస్సార్ సీపీ పక్షమే
- జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

పట్నంబజారు: బీసీల ఆడపడుచు, రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా సమర్థంగా సేవలందించిన విడదల రజినిని పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న బీసీలంతా ఐక్యంగా గెలిపించుకుంటామని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు తెలిపారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లో సాయిబాబా రోడ్డు వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ ప్రకటించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేశారని, బీసీ కులాలకు చెందిన వారిని ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులుగా నియమించి గౌరవించారని అన్నారు. గతంలో బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఎవరూ బీసీల కోసం ఇంత మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో బీసీలంతా ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విడదల రజిని 30 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని చెప్పారు. సమావేశంలో మహిళా సంఘం అధ్యక్షురాలు పరిమి ప్రశాంతి, ఎన్‌నీలావతి, గుంటుపల్లి అనిల్ కుమార్, యలమంచి లక్ష్మీనారాయణ, ఎండీ జాకీర్, పి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

గుంటూరు ఎంపీ స్థానం బరిలో 30 మంది అభ్యర్థులు

గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ స్థానం బరిలో 30 మంది నిలిచారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా నలుగురు అభ్యర్థులు దండెం రత్నం, కాసు ఏసురెడ్డి, బోయపాటి వెంకటరమణ, శ్రీనివాసరావు పాలకాయల తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిను కలసి నామినేషన్లు వెనక్కి తీసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు తమ వ్యయాలకు సంబంధించిన బిల్లులతో సహా రిజిస్టర్లు సక్రమంగా మెయింటెన్ చేయాలన్నారు. వచ్చే నెల 3, 7, 11 తేదీల్లో వ్యయ పరిశీలకులు ఉదయం 10 నుంచి సాయంత్ర 5 గంటలలోపు వీటిని తనిఖీ చేస్తారన్నారు. అభ్యర్థులు స్వయంగా గాని, వారి తరపున ఎవరినైనా పంపాలని పేర్కొన్నారు.

అసెంబ్లీ స్థానాలకు ఖరారైన అభ్యర్థులు

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సోమవారం ఫైనల్ లిస్టు ఖరారైంది. కొందరు అభ్యర్థులు తమ నామినేషన్లు వెనక్కి తీసుకున్నారు. ఈ క్రమంలో తాడికొండకు పది మంది, మంగళగిరిలో 42 మందికి గాను 40 మంది, పొన్నూరుకు 14 మందికి గాను 14, తెనాలి 14 మందికి గాను 13 మంది, ప్రత్తిపాడు 13 మంది , గుంటూరు వెస్ట్‌కు 31 మందికి గాను 28, గుంటూరు ఈస్ట్‌కు 17 మందికి గాను 14 మంది బరిలో నిలిచారు.

రెండోసారి లోకేష్‌కు ఓటమి తప్పదు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



మంగళగిరి: టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోకేష్‌కు రెండోసారి ఓటమి తప్పదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 27వ వార్డు రాజీవ్‌గృహకల్ప కాలనీ, పావురాల కాలనీలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యను గెలిపించాలని కోరుతూ పార్టీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలసి ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు దేవళ్ళ సుబ్బారావు, దేవళ్ళ పద్మ, పట్టణ జేసిఎస్ కన్వీనర్ ఎండి ఫిరోజ్, నాయకులు ఈపూరి ఆదామ్, మల్లవరపు సుధారాణి, మురుగుడు సత్యం, గుంటి రాజ్యలక్ష్మి, గూండా మధు, బేతపూడి నరసయ్య, అరంజ్ అంజి, పాల శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో అత్యధికంగా చేరి పార్టీ విజయానికి ప్రజలే కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో 40 కుటుంబాలు సోమవారం పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ కౌన్సిలర్ రాపర్తి రామలక్ష్మి స్థానిక నాయకులు రాపర్తి సత్యనారాయణ, రాపర్తి శేషారావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, ఉన్నారు.

మైక్రో అబ్జర్వర్ల విధులు చాలా కీలకం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ కేంద్రాల్లో విధులు నిర్వహించే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మొత్తం ప్రక్రియను నియోజకవర్గాల పరిశీలకులు నీరజ్ కుమార్, కార్తీకకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జగనన్న ద్వారానే మాదిగల అభివృద్ధి

- మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు
- జిల్లా ఎమ్మార్పీఎస్, ప్రత్తిపాడు నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు

గుంటూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే మాదిగల అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు అన్నారు. సోమవారం వికాస్‌నగర్‌లోని ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా ఎమ్మార్పీఎస్, ప్రత్తిపాడు నియోజకవర్గం మాదిగల ఆత్మీయ సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగతో కలసి పాల్గొన్నారు. రావెల మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న మాదిగ సామాజికవర్గం మొత్తం బలసాని కిరణ్‌కుమార్‌కు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. అత్యధిక మెజారిటీతో బలసానిని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మా సమస్యలు విన్నవించామని, తప్పకుండా మాదిగ సామాజికవర్గం అభివృద్ధి కోసం అన్నివిధాలా కృషిచేస్తానని హామీ ఇచ్చారన్నారు. బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వైఎస్సార్ సీపీకి మద్దతు తెలుపుతుందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పాలనను గౌరవిస్తూ మరలా ఆయన ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో బలసాని కిరణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.